అక్రమ మద్యం స్వాధీనం

విశాలాంధ్ర - పాయకరావుపేట : మండలంలోని శ్రీరాంపురం గ్రామ సమీపంలో ఎటువంటి అను మతులు లేకుండా తీసుకెళుతున్న అక్రమ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఏఎస్ఐ నాయుడు బాబు తెలిపారు. అక్రమ మద్యం రవాణా జరుగు తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు సిబ్బందితో తనిఖీ నిర్వ హించగా ఒక వ్యక్తి పోలీసులను చూసి పారిపోవుటకు ప్రయత్నించినట్లు తెలిపారు. పారి పోతున్న వ్యక్తిని పట్టుకొని అతని వద్ద ఎటువంటి రసీదులు లేని ఇతర రాష్ట్రాలకు చెందిన 8 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈమెరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ నాయుడు బాబు తెలిపారు.

15 రోజులకు ఒకసారి తాగునీటి పరీక్షలు తప్పనిసరి

జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్

విశాలాంధ్ర - అనకాపల్లి కలెక్టరేట్ : జిల్లాలో అన్ని ప్రభుత్వ పాఠశాలలు, అన్ని సంక్షేమ వసతి గృహాలు మరియు అంగన్వాడీలలో సరఫరా అయ్యే తాగునీటిని 15 రోజుల ఒకసారి తప్పనిసరిగా పరీక్షలు జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా గ్రామీణ నీటి సరఫరా మరియు పారిశుధ్య%శీ% మిషన్ కమిటీ జిల్లా స్థాయి సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తాగునీటి వనరుల వద్ద మురుగు చేరకుండా, పరిసరాలు పరిశుభ్రంగా ఉండే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. క్రమం తప్పకుండ తాగునీటి పరీక్షలు, ట్యాంకుల శుభ్రత, క్లోరినేషన్ తప్పనిసరిగా జరగాలన్నారు. బహిరంగ మల విసర్జన జరగకుండా చర్యలు చేపట్టాలని, కాచిన నీటిని తాగడం, ఆహారం తినే ముందు, మల విసర్జన తరువాత శుభ్రంగా చేతులు కడుక్కోవడంపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. భూగర్భ జలాలు పెంచడానికి కమ్యూనిటీ సోక్ పిట్స్ నిర్మాణం, చెరువు గట్ల పటిష్టం చేయడంపై దృష్టి పెట్టాలన్నారు. జిల్లాలో ఉన్న 1539 గ్రామాల్లో నూరు శాతం గృహాలకు కుళాయి కనెక్షన్లు ఏర్పాటు చేసి 'హర్ ఘర్ జల్' గ్రామాలుగా చేయడానికి కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో జల జీవన్ మిషన్ పనులను సక్రమంగా అమలు చేయాలని జిల్లా గ్రామీణ నీటి సరఫరా మరియు పారిశుధ్య%శీ% కార్యనిర్వాహక ఇంజనీర్ అనిల్ కుమార్ కు సూచించారు. ఈ సమావేశంలో జిల్లా గ్రామీణ నీటి సరఫరా మరియు పారిశుధ్యం కార్యనిర్వాహక ఇంజనీర్ జె. అనిల్ కుమార్, డీ.ఈ., ఎ. సావిత్రి, జెడ్పి సి ఈ ఓ. శివ నారాయణ మూర్తి, జిల్లా పంచాయతీ అధికారి సందీప్ , జిల్లా అటవీ శాఖ అధికారి ఎం శ్యామ్ సుందరామ్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఆశా దేవి, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి మంగవేణి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ హైమావతి, డీఆర్డీఏ పీడీ శచి దేవి, తదితరులు పాల్గొన్నారు.

మండల స్థాయి ఉపాధ్యాయుల క్రీడా టోర్నమెంట్స్

విశాలాంధ్ర - రోలుగుంట : రాష్ట్రవ్యాప్తంగా ఉపాధ్యాయ ఉద్యోగుల కోసం రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న క్రీడా టోర్నమెంట్స్‌లో భాగంగా ఈ నెల 28, 29 తేదీల్లో మండల స్థాయి టీచర్స్ టోర్నమెంట్స్ నిర్వహిస్తు న్నట్లు మంగళవారం మండల విద్యా శాఖ అధికారులు జాన్ ప్రసాద్, జగ్గారావులు తెలిపారు. రోలుగుంట జడ్పీహెచ్ పాఠశాలలో ఈ పోటీలు జరుగనున్నాయి. పురుష ఉపాధ్యాయులకు క్రికెట్, మహిళా ఉపాధ్యాయులకు త్రోబాల్ పోటీలు ఏర్పాటు చేశారు. మండలంలోని అన్ని పాఠశాలల ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొనేందుకు సిద్ధమవుతున్నారని అధికారులు పేర్కొన్నారు. క్రీడా కార్యక్రమాలు ఉపాధ్యాయుల ఆరోగ్యం, స్నేహపూర్వక వాతావరణానికి దోహదం చేస్తాయని వారు తెలిపారు.

మేడివాడ విద్యార్థిని భాగ్యశ్రీకి పలువురి ప్రశంసలు

విశాలాంధ్ర - రావికమతం : మండలంలో మేడివాడ గ్రామానికి చెందిన మోపాడ భాగ్యశ్రీ పరుగు పందెంలో సత్తా చాటి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయినట్టు మే డివాడ ప్రధానోపాధ్యాయులు వంకాయల రామా రావు తెలిపారు. మేడివాడకు చెందిన భాగ్యశ్రీ మేడివాడ హై స్కూల్లో చదువు తుండగా 100మీటర్ల పరుగు పందెంలో మండల స్థాయిలో గెలిచి జిల్లా పోటీలకు వెళ్ళగా అక్కడ సత్తా చాటి విశాఖ జిల్లా తరపున వినుకొండలో జరిగిన పరుగు పందెంలో రాష్ట్ర స్థాయిలో ఆడింది. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయి 4వ స్థానం పొందగా స్టాండ్ బై ఆడేందుకు లక్నో వెలుతోందని ఆయన తెలిపారు. భాగ్యశ్రీ ని గ్రామస్తులు పలువురు అభినందించారు.

నేటి నుండి శ్రీ మహాలక్ష్మి సహిత రుద్ర హోమం

విశాలాంధ్ర - సబ్బవరం : మండల కేంద్రంలో గల స్థానిక శ్రీశ్రీ శ్రీ దుర్గాలమ్మ అమ్మ వారి దేవాలయం వద్ద మార్గశిర మాసం సందర్భంగా శ్రీ మహాలక్ష్మి సహిత రుద్ర హెూమం 11 రోజులు నిర్వహించబడునని ఆలయ ఉత్సవ కమిటీ నిర్వాహకులు తెలిపారు. శ్రీ మహా లక్ష్మి సహిత రుద్ర హెూమం ఈనెల 26వ తేదీ బుధవారం నుంచి డిసెంబర్ నెల 6వ తేదీ శని వారం వరకు ప్రతిరోజు ఉదయం 6 గంట లకు అమ్మ వారికి సహస్ర నామ కుంకుమార్చన, ఆలయ పురోహితులు రేజేటి శేఖర్ తెలిపారు.

మునగపాకలో వైసీపీ కోటి సంతకాల సేకరణ

విశాలాంధ్ర - మునగపాక : పేదలకు వైద్య,విద్యను కూటమి ప్రభుత్వం దూరం చేస్తోందని వైయస్సార్సీపి అనకాపల్లి పార్లమెంట్ సమన్వయకర్త బొడ్డేడ ప్రసాద్, యలమంచిలి నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ పేర్కొన్నారు.మేజర్ పంచాయతీ మునగపాకలో మంగళవారం మెయిన్ రోడ్ అపోలో మెడికల్ వద్ద ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైయస్సార్సీపి నాయకులు కార్యకర్తలు కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన బొడ్డేడ ప్రసాద్,కరణం ధర్మశ్రీలు మాట్లాడుతూ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణతో పేదలకు వైద్యం దూరం అవుతుందని ఆరోపించారు.విద్య,వైద్యం అంటే గుర్తుకొచ్చేది వైయస్సార్, జగన్మోహన్ రెడ్డి అన్నారు. విద్య, వైద్యానికి వారు పెద్దపీట వేశారని తెలిపారు. ఫీజు రియంబర్స్మెంట్,ఆరోగ్యశ్రీ పథకాలతో పేదల జీవితాల్లో వెలుగులు నింపారని తెలిపారు. పేదలకు ఉచిత వైద్య విద్య అందించాలనే సంకల్పంతో జగన్మోహన్ రెడ్డి మెడికల్ కళాశాలలను తీసుకొస్తే వాటిని కూటమి ప్రభుత్వం ప్రైవేటీకరణ పేరుతో కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతోందని విమర్శించారు. గడిచిన 16 నెలల్లో రాష్ట్రంలో రెండు లక్షల కోట్లు అప్పు చేసిన కూటమి సర్కార్ మెడికల్ కళాశాలల ప్రభుత్వ రంగంలో పూర్తిచేసేందుకు 5 వేల కోట్లు ఖర్చు చేయలేదా అని ప్రశ్నించారు. మునగపాకలో నిర్వహించిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుందన్నారు. ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి వైద్య కళాశాల ప్రైవేటీకరణ అంశాన్ని వ్యతిరేకిస్తూ మద్దతునిస్తున్నారని,సంతకాలు చేసి తమ అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల వైసీపీ అధ్యక్షులు ఆడారి అచ్చియ్యనాయుడు, మునగపాక జడ్పిటీసి సోము సత్యనారాయణ,జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు పిల్లి అప్పారావు, ఎంపీటీసీ సూరిశెట్టి రాము,మద్దాల వీరునాయుడు, మునగపాక గ్రామ సర్పంచ్ దిమ్మల అప్పారావు, తిమ్మరాజుపేట గ్రామ ఉప సర్పంచ్ కాండ్రేగుల జగన్, వైసీపీ నాయకులు ఆడారి కాశీబాబు, నరాలశెట్టి సూర్యనారాయణ, వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రూ.91 లక్షలతో బ్రిడ్జి నిర్మాణం

విశాలాంధ్ర - కె కోటపాడు : ఈ మండలం ఆనందపురం వద్ద రైవాడ కాలువపై బ్రిడ్జి శిథిలమై కూలిపోవడంతో అనేకమంది ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. విశాఖపట్నం నుండి దేవరపల్లి వెళ్లే బస్సులు సుమారు ఐదు నెలల నుండి ఆ ప్రాంతంలో రద్దు చేశారు. కొన్ని బస్సులు కే కోటపాడు మీదుగా రాకపోకలు సాగించాయి. ప్రయాణికుల ఇబ్బందులను గమనించి స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి విశాఖపట్నం కార్పొరేషన్ ద్వారా బ్రిడ్జి నిర్మాణానికి రూ. 91 లక్షల నిధులు మంజూరు చేయించారు. మంగళవారం విశాఖ నగర్ మేయర్ పీల శ్రీనివాస్ తో కలిసి ఎమ్మెల్యే బండారు బ్రిడ్జి కు శంకుస్థాపన చేశారు. తమ ఇబ్బందులను గమనించి త్వరగా బ్రిడ్జి నిర్మాణం చేయించడం ఆనందంగా ఉందని తొమ్మిది గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కొప్పుల వెలమ కార్పొరేషన్ చైర్మన్ పివిజి కుమార్ కూటమి నాయకులు పాల్గొన్నారు.

కృష్ణంపాలెంలో రిలయన్స్ సాఫ్ట్ డ్రింక్స్ జ్యూస్ పరిశ్రమ

విశాలాంధ్ర - రాంబిల్లి : రాంబిల్లి మండలం, కృష్ణం పాలెంలో రిలయన్స్ సాఫ్ట్ డ్రింక్ జ్యూస్ ప్యాకేజింగ్ డ్రింకింగ్ వాటర్ పరిశ్రమ ఏర్పాటు కానుంది. దీనికి 784 కోట్లు పెట్టుబడి పెట్టనున్నారు. ఈ మేరకు ప్రభుత్వంతో ఒప్పందం కుదిరింది.ఈ పరిశ్రమ ద్వారా 300 మందికి ఉద్యోగ ఉద్యోగ అవకాశాలు కలుగుతాయని రిలయన్స్ కంపెనీ ప్రకటించింది.ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడుకి, ఉప ముఖ్యమంత్రి వర్యులుకొణిదెల పవన్ కళ్యాణ్ కిమన ఎలమంచిలి నియోజకవర్గం శాసనసభ్యులుసుందరపు విజయ్ కుమార్‌కి యలమంచిలి నియోజకవర్గ జనసేన పార్టీ తరపున ప్రజలందరూ ధన్యవాదాలు తెలియజేస్తున్నారు.

కార్మికశాఖ కమీషనర్‌ను కలిసిన కొండబాబు

విశాలాంధ్ర - అచ్యుతాపురం : భవన నిర్మాణ కార్మికులు, ఇతర సమస్యలపై అనకాపల్లి జిల్లా టిఎన్‌టియుసి ప్రధాన కార్యదర్శి పొన్నమల్ల కొండబాబు ఇతర నాయకులుతో కలిసి కార్మిక శాఖ కమీషనర్‌ను, కార్మిక సంక్షేమ బోర్డు చైర్మన్‌లను విజయవాడలో మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా కొండబాబు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఆగిపోయిన భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు ద్వారా అమలు చేసే కార్యక్రమాలు కూటమి ప్రభుత్వంలో పునరుద్ధరించడానికి కమిషనర్ తో చర్చించినట్లు తెలిపారు.

అగ్నివీర్‌కు ఎంపికైన కొత్తకోట కళాశాల విద్యార్థి

విశాలాంధ్ర - రావికమతం : కొత్తకోట జూనియర్ కళాశాల్లో ఈ ఏడాది మార్చిలో ఇంటర్ పూర్తి చేసిన గొంప గ్రామానికి చెందిన విద్యార్థి కండ్రేడ్డి పవన్ కుమార్ ఇటీవల పూనే లో జరిగిన అగ్నివీర్ (ఆర్మీ)లో సెలెక్ట్ అయ్యాడు. ఈ కళాశాలలో ఇంటర్ చదువుతున్నపుడు విద్యార్థి జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయి అత్యంత ప్రతిభ చూపాడు. మంగళవారం కొత్తకోట కళాశాలకు సర్టిఫికెట్స్ నిమిత్తం రావడంతో పవన్ కుమార్ ను ప్రిన్సిపాల్ సత్యవతితో పాటు అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది ఘనంగా అభినందించారు.

కవగుంటలో ఉచిత వైద్య శిబిరం

విశాలాంధ్ర - రావికమతం : మండలంలో కవ్వ గుంట గ్రామంలో మంగళవారం ఫ్యామిలీ ఫిజీషియన్ ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సంద ర్భంగా రావికమతం పిహెచ్సి వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ మారు మూల గ్రామాలలో ఫ్యామిలి ఫిజిషన్ ద్వారా ఉచిత వైద్యం అందించేందుకు తమ ప్రయత్నం చేస్తున్నట్టు తెలిపారు. అనంతరం శిబిరానికి 62 మంది రోగు లురాగా వారికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డీఏ ఓమహేష్, ఏఎన్ఎం ప్రభ, ఎంఎలెచ్పీలు, సిబ్బంది పలువురు పాల్గొన్నారు.

ధర్మవరంలో నూకలమ్మ తల్లి బోనాలు

విశాలాంధ్ర - యస్.రాయవరం : మండలంలో ధర్మవరం అగ్రహారం గ్రామంలో శ్రీ నూకాలమ్మ తల్లి బోనాలు కార్యక్రమం నిర్వహించారు .ఆలయం వార్షికోత్సవం సందర్భంగా గ్రామంలో భక్తులు బోనాలుతో ఊరేగింపు నిర్వహించి అమ్మవారికి సమర్పించారు .అనంతరం భారీ అన్న సమారాధన ఏర్పాటు చేయడంతో భక్తులు వచ్చి అన్నప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ క్రిస్టియన్ విభాగం నియోజకవర్గ అధ్యక్షులుగా నెలపర్తి నాగేశ్వరరావు నియామకం

విశాలాంధ్ర - పాయకరావుపేట : తెలుగుదేశం పార్టీ పాయకరావుపేట నియోజకవర్గ క్రిస్టియన్ విభాగం అధ్యక్షుడుగా పట్టణంలోని ఇందిరా కాలనీకి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు, సామాజిక కార్యకర్త నెలపర్తి నాగేశ్వరరావు నియమితులయ్యారు. ఈ మేరకు హెూం మంత్రి క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పార్టీలో పలు పదవులు పొందిన నాయకులతో కలసి నెలపర్తి నాగేశ్వరరావు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా నెలపర్తి నాగేశ్వరరావు మాట్లాడుతూ తనకు పదవి కల్పించిన హెూం మంత్రి వంగలపూడి అనిత, టిడిపి మండల అధ్యక్షులు చించలపు ప్రదీప్, పట్టణ అధ్యక్షులు యాళ్ళ వరహాల బాబు, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ పెదిరెడ్డి చిట్టిబాబు, రాష్ట్ర నాటక అకాడమి డైరెక్టర్ పల్లా విలియం కేరీ లకు కృతజ్ఞతలు తెలిపారు.

కర్షక వ్యతిరేక చట్టాలు, లేబర్ కోడ్ రద్దుకై నిరసనలు

విశాలాంధ్ర - చోడవరం : నవంబర్ 25, కర్షక, కార్మిక వ్యతిరేక చట్టాలు... లేబర్ కోడ్ రద్దుకై అనకాపల్లి జిల్లా కేంద్రంలో బుధవారం నిర్వహించనున్న నిరసన కార్యక్రమం జయప్రదం చేయవలసిందిగా ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డిపల్లి అప్పలరాజు మంగళవారం ఓ ప్రకటనలో కోరారు. కేంద్రంలో అధికార బిజెపి ప్రభుత్వం తీసుకు వచ్చిన రైతు వ్యతిరేక నల్ల చట్టాలకు వ్యతిరేకంగా రైతాంగం పోరాడి 5 సంవత్సరాలు పూర్తి అవుతున్న సందర్భంలోను, రైతాంగానికి కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయనందుకు లేబర్ కోడ్ రద్దు చేయాలనే డిమాండ్‌లతో నిరసన కార్యక్రమం చేపడుతున్నట్లు తెలియజేశారు. కావున కార్మిక కర్షక సోదరులు అనకాపల్లి నెహ్రూ చౌక్ వద్ద జరపతలపెట్టిన నిరసన కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయవలసిందిగా విజ్ఞప్తి చేశారు.

వృద్ధులకు, వికలాంగులకు దుప్పట్లు బియ్యం పంపిణీ

విశాలాంధ్ర - కశింకోట : మండలంలోని మాజీ మంత్రి భీమిలి శాసనసభ్యులు గంటా శ్రీనివాసరావు జన్మదిన వారోత్సవాల్లో భాగంగా గంటా యువసేన ఆధ్వర్యంలో మండలంలోని అడ్డాం గ్రామంలో 50 మంది వృద్ధులకు వికలాంగులకు దుప్పట్లు బియ్యం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా జిల్లా తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి ఉగ్గిన రమణమూర్తి. కశింకోట పిఏసిఎస్ చైర్మన్ సిద్దిరెడ్డి శ్రీనివాసరావు పాల్గొన్నారు. ముందుగా రమణమూర్తి ,శ్రీనివాసరావు మాట్లాడుతూ 18 సంవత్సరాలుగా గంటా శ్రీనివాసరావు జన్మదిన వారోత్సవాలు భాగంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న గంటా యువసేన కన్వీనర్లు గొంతీన గంగాధర్ జెర్రిపోతులు నూకునాయుడు లను అభినందించారు . ఇలాగే ప్రతి ఒక్కరు సేవా దృక్పథంతో సేవా కార్యక్రమాలు నిర్వహించాలని తెలియజేశారు. వారు చేతుల మీదగా దుప్పట్లు బియ్యం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గంటా యువసేన కన్వీనర్ జెర్రిపోతుల నూకు నాయుడు, గొంతిన గంగాధర్ మాజీ డిసిసిబి డైరెక్టర్ ఆంధ్ర ప్రసాద్, మాజీ సర్పంచ్ రెడ్డి కన్నబాబు, బిజెపి నాయకులు గుంటూరు మణిరాజు ,మండల తెలుగు యువత అధ్యక్షులు ఉగ్గిని నాయుడు బాబు, మండల తెలుగు యువత ప్రధాన కార్యదర్శి కుండ్రపు ప్రదీప్, ఐటీడీపీలు సెక్రెటరీ వీరబ్రహ్మం, రామకృష్ణ, తురకలపూడి రాజబాబు, ఎస్ఎం నాయుడు, మండల తెలుగు యువత కార్యదర్శి గొంతిన ప్రసాద్ ,తెలుగు యువత నాయకులు రెడ్డి శివ, డాక్టర్ సెల్ ఉపాధ్యక్షులు కోనేటి శివ, తెలుగు నాయకులు పరవాడ రమణ, మరియు కూటమి నాయకులు పాల్గొన్నారు.

వైసీపీ అభివృద్ధికి కషి చేస్తాను : జోగా కొండబాబు

విశాలాంధ్ర - బుచ్చయ్యపేట : తనపై నమ్మకంతో తాను పార్టీకి చేస్తున్న సేవలను గుర్తించి మండలంలోని పార్టీ బాధ్యతలు రెండవసారి అప్పగించినందుకు కృతజ్ఞతగా చోడవరం నియోజకవర్గ పరిశీలకులు మాజీ మంత్రివర్యులు గుడి వాడ అమర్నాథ్‌ను బుచ్చయ్యపేట మండలం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా ఇటీవల నియమించబడిన జోగా కొండబాబు మండల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో కలిసి గాజువాకలోని ఆయన నివాసానికి నేరుగా వెళ్లి ఘనంగా సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రియతమ మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆశయాలకు అనుగుణంగా పార్టీ అభ్యున్నతికి నిరంతరం కృషి చేస్తూ పూర్వ వైభవం తీసుకురావడానికి శాయశక్తుల కృషి చేస్తానని పెద్దల సూచనలతో, కార్యకర్తలు, అభిమానుల సహాయ సహకారాలతో పార్టీలో ఎటువంటి భేదాభిప్రాయాలకు తావు లేకుండా జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో వైయస్సార్ కాంగ్రెస్ జెండాను రెపరెపలాడించడమే లక్ష్యంగా పనిచేస్తానని తెలిపారు. కార్యక్రమంలో వైయస్సార్ కాంగ్రెస్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి, జడ్పిటిసి సభ్యులు దొండా రాంబాబు తో పాటు పలు గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు శ్రీశ్రీశ్రీ స్వయంభూ సుబ్రమణ్యేశ్వరస్వామి షష్ఠి మహోత్సవం

విశాలాంధ్ర- సబ్బవరం : మండలంలోని అంతకాపల్లి గ్రామంలో ఈనెల 26వ తేదీ లగుడు వారి ఇల్లులు దరి ఉన్న శ్రీ స్వయంభూ సుబ్రమణ్యేశ్వరస్వామి షష్టి పూజ మహెూత్సవం కు ఏర్పాట్లు జరుగునున్నట్లు ఆలయ ఉత్సవ కమిటీ నిర్వాహకులు తెలిపారు.బుధవారం ఉదయం గం? 8.15 ని?లకు శ్రవణం నక్షత్రయుక్త, దనుర్ లగ్నమందు ఉత్సవమూర్తిని తీసుకొని వచ్చుట, ప్రత్యేక పూజలు, మండప పూజలు, సహస్ర భస్మార్చన, నిరాజనధి, మంత్ర పుష్పములు, వేద ఆశీర్వచనం ఆలయ పురోహితుడు రవితేజ శర్మ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు తెలిపారు.పై పూజలు వలన వివాహ, ఉద్యోగ, ఆరోగ్య, ప్రయాణ, సంతాన, వైర సంభందిత దోషములు నివారణ చేయబడును.అదేరోజు మధ్యాహ్నం 12 గం౹౹ నుండి అన్నసంతర్పణ జరుగును, అలాగే సాయంత్రం 6 గంటల నుండి దీపాలంకరణ సేవ జరుగునని తెలిపారు. ఈ పూజా కార్యక్రమంలో అత్యధిక సంఖ్యలో భక్తులు, ప్రజలు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరిస్తారని కోరారు.

సామాజిక తనిఖీ తప్పనిసరి

విశాలాంధ్ర - రావికమతం : ఉపాది హామీ పథకం పనులపై సామాజిక తనిఖీలు అక్షేపణ, ఆరోపణలకు తావులేకుండా పక్కాగా నిర్వహించాలని సామాజిక తనిఖీ విభాగం ఎస్ఆర్పి దాసు చెప్పారు. రావికమతం ఐసీడీఎస్ కార్యాలయంలో మంగళవారం సామాజిక తనిఖీ నిర్వహించే క్షేత్ర స్థాయి సిబ్బందికి శిక్షణ కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా డిప్యూటీ ఎంపీడీవో సీతారామస్వామి మాట్లాడుతూ మండలంలో 18వ విడత సామాజిక తనిఖీని 2024 మార్చి నుంచి 2025 వరకు ఏడాది కాలం పాటు ఎన్ఎస్ఈజీఎస్, ఇంజనీరింగ్, సోషల్ ఫారెస్టు, గృహ నిర్మాణం తదితర శాఖల్లో రూ.21.24 కోట్లతో జరిగిన 1,202 పనులకు సంబంధించి సామాజిక తనిఖీ చేస్తున్నట్టు చెప్పారు. సామాజిక తనిఖీ సిబ్బంది క్షేత్ర స్థాయిలో పర్యటించి ప్రతిపాదిత పనులు జరిగాయా లేదాని నిర్ధారించడంతో పాటు ఉపాది కూలీలకు చేసిన -పనికి తగిన వేతనం అందించడం, బినామీ మస్టర్లు తదితర అంశాలపై పక్క గా క్షేత్ర స్థాయి వచ్చిన అంశాలను గ్రామ సభలో వెల్లడించి గ్రామ సభ ఆమోదం మేరకు మండల స్థాయిలో జరిగే ప్రజావేదికలో వెల్లడించాలని చెప్పారు. సామాజిక తనిఖీల్లో ఎక్కడ ఏ లోపం జరిగినా అందుకు క్షేత్ర స్థాయి పరిశీలన చేసిన సామాజిక తనిఖీ బృందమే బాధ్యత వహించాల్సివుంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏపీవోలు కాశీ, చిన్నారావు, పీఆర్ జేఈ, సోషల్ ఫారెస్టు, మండల ఇంజనీరింగ్, గృహ నిర్మాణ శాఖల అధికారులు, సామాజిక తనిఖీ డీఆర్పి, క్షేత్ర స్థాయి సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులకు అవగాహన

విశాలాంధ్ర - అనకాపల్లి : ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ ఎం. వెంకట నారాయణ ఆధ్వర్యంలో, ఎస్సై డి. శేఖరం సంయుక్త డిగ్రీ కాలేజీలో విద్యార్థులకు మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మైనర్ డ్రైవింగ్ వల్ల కలిగే ప్రమాదాలు, హెల్మెట్ వినియోగం, ప్రాముఖ్యత, ట్రాఫిక్ నిబంధనలు, కొత్త క్రిమినల్ చట్టాలు, సైబర్ క్రైమ్ నుంచి ఎలా జాగ్రత్తపడాలి అనే అంశాలపై విద్యార్థులకు వివరించారు. ఇన్స్పెక్టర్ వెంకటనారాయణ విజయ మెడికల్ కూడలి వద్ద మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలను తగ్గించడంలో యువత పాత్ర ఎంతో కీలకమని, ట్రాఫిక్ నియమాలు పాటించడం ప్రతి పౌరుడి బాధ్యత అని సూచించారు. మైనర్ డ్రైవింగ్ పూర్తిగా నిషేధించబడినదని, తల్లిదండ్రులు కూడా తమ పిల్లలకు వాహనాలు అప్పగించకూడదని తెలిపారు. ఎస్.ఐ శేఖరం మాట్లాడుతూ. కొత్త క్రిమినల్ చట్టాల్లో వచ్చిన మార్పులు, సైబర్ మోసాల నుండి ఎలా రక్షించుకోవాలి, అనుమానాస్పద లింకులు వంటివాటిపై విద్యార్థులకు వివరించారు.

శ్రీ విద్య ఉపాసన కోర్సుల్లో పాల్గొన్న దేశ విదేశీ సాధకులు

విశాలాంధ్ర - సబ్బవరం : మండలంలోని దేవీపురం లో ఈ నెల 21 నుండి 25 వ తేదీ వరకు ఆంగ్లమాధ్యమ యుక్తంగా శ్రీ విద్యా ఉపాసనా ప్రారంభిక కోర్స్ లు పూర్తిచేసి, సాధన చేస్తూ ముందుకెళ్లిన షుమారు 22 మంది దేశ విదేశీ సాధకులు వచ్చి గురుమాత శ్రీమతి అన్నపూర్ణమ్మ ముఖతః ఈ కోర్సు కు సంబంధించిన మంత్ర దీక్షలు పొందారు.అటుపైన శ్యామా, వారాహీ దేవతలకు సంబంధించిన యంత్ర పూజలు, తర్పణాలు ప్రయోగాత్మకంగా నేర్చుకొని ఆఖరి రోజునాడు తత్సంబంధిత హెూమాలు కూడా నేర్చుకొన్నారు. ఆచార్యులుగా శ్రీమతి మర్తి రాధ, కందర్ప రమ సవివరంగా బోధించారు. దేశ విదేశీ సాధకులను గురుమాత చేతులమీదుగా ఈ కోర్స్‌కు సంబంధించిన పాత్యాంశాలు పొందారు.గురునాథ అందర్నీ ఆశీర్వదించారు.

అగ్రస్థానంలో ఏపీజీబీ.... 1.21 కోట్ల ఖాతాదారులతో రికార్డు

విశాలాంధ్ర - రోలుగుంట : ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు రాష్ట్రంలో అగ్రగామి గ్రామీణ బ్యాంకుగా ఎదిగిందని, ప్రస్తుతం 1.21 కోట్ల ఖాతాదారులతో ఏపీ బ్యాంకింగ్ రంగంలోనే అత్యధిక ఖాతాదారులు కలిగిన బ్యాంకుగా నిలిచిందని ఏపీ గ్రామీణ బ్యాంకు జనరల్ మేనేజర్ ఎ.రాజశేఖరం తెలిపారు. నాలుగు గ్రామీణ బ్యాంకుల విలీనంతో ఏర్పడిన ఏపీజీబీ రాష్ట్రవ్యాప్తంగా అత్యధిక శాఖలున్న గ్రామీణ బ్యాంకుగా అవతరించిందని చెప్పారు. మంగళవారం రోలుగుంటలో నూతనంగా నిర్మించిన ఏపీజీబీ భవనాన్ని ఆయన ప్రారంభించారు. జ్యోతి ప్రజ్వలన చేసి అనంతరం మేనేజర్ గది, భద్రతా విభాగాలను ప్రారంభించారు. అనంతరం స్వయం సహాయ సంఘాల మహిళలు, ఖాతాదారులతో సమావేశం నిర్వహించారు. జీఎం రాజశేఖరం మాట్లాడుతూ.. "ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ 2025 మే 1న అధికారికంగా ప్రారంభమై, రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో ప్రస్తుతం 23 రీజనల్ ఆఫీసులు, 1,351 శాఖలుతో సేవలు అందిస్తోంది" అని పేర్కొన్నారు. మహిళలు రుణాలను ఉపయోగించుకుని ఆర్థికంగా బలోపేతం కావాలని సూచించారు. పాడి పశువుల పోషణ, చిన్న వ్యాపారాల కోసం రుణాలు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. డ్వాక్రా మహిళలకు పూచీకత్తులేకుండా రూ.20 లక్షల వరకు రుణాలు మంజూరు చేసే అవకాశం ఉందన్నారు. రీజనల్ మేనేజర్ ఎస్. సతీష్ చంద్ర మాట్లాడుతూ.. పురుషులతో పోల్చితే మహిళా డిపాజిటర్లకు ఏపీజీబీ అధిక వడ్డీ ఇచ్చే ఏకైక బ్యాంకుగా నిలుస్తోందన్నారు. ప్రత్యేకంగా మహిళా సూపర్ సీనియర్ సిటిజన్లకు 444 రోజుల కాలపరిమితి డిపాజిట్ పథకంలో 7.95 శాతం వడ్డీ అందిస్తున్నట్లు చెప్పారు. పీఎంఈజీపీ, ముద్రా, పీఎం సూర్యఘర్ వంటి పథకాల కింద సబ్సిడీ రుణాలు అందిస్తున్నట్లు వివరించారు. జీవన్ జ్యోతి భీమా, సురక్ష భీమా, అటల్ పెన్షన్ యోజన వంటి పథకాల ప్రయోజనాలు పొందాలని సూచించారు. రీజనల్ సెక్రటరీ పి.సాయి కిరణ్ మాట్లాడుతూ.. "గ్రామీణ ప్రాంతాల్లో బ్యాంకింగ్ సౌకర్యాలను మరింత మెరుగుపరచడమే ఏపీజీబీ లక్ష్యం" అన్నారు. అన్ని సేవలను డిజిటలీకరణ ద్వారా ఖాతాదారుల ముందుకు తీసుకొస్తున్నామని చెప్పారు. గ్రామీణ ఖాతాదారులు మొబైల్ బ్యాంకింగ్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తమ డిపాజిట్లు, లావాదేవీల వివరాలను క్రమం తప్పకుండా అప్‌డేట్ చేసుకోవాలన్నారు. బ్రాంచ్ మేనేజర్ పి.మహేశ్వరరావు మాట్లాడుతూ.. "పాత బ్రాంచ్ బస్టాండ్ కు దూరంగా ఉండటంతో ఖాతాదారులు నడిచి రావాల్సిన ఇబ్బంది ఉండేది. అలాగే ఫస్ట్ ఫ్లోర్‌లో ఉండటంతో వృద్ధులకు మరింత కష్టం ఏర్పడేది" అని పేర్కొన్నారు. ఖాతాదారుల అభిప్రాయాల ఆధారంగా నూతన భవనం ప్రతిపాదన పంపించామని, రీజనల్ మేనేజర్ సతీష్ చంద్ర వెంటనే ఆమోదం ఇచ్చి నిర్మాణం జరిగిందన్నారు. ప్రస్తుతం శాఖ వ్యాపారం రూ.75 కోట్లుగా ఉండగా, త్వరలోనే రూ.100 కోట్ల లక్ష్యాన్ని అందుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సుర్ల రామకృష్ణ, వైసీపీ రాష్ట్ర బీసీ సెల్ ప్రతినిధి పోతల శ్రీనివాసరావు, బ్యాంకు సిబ్బంది, సీఎస్పీలు తదితరులు పాల్గొన్నారు.

మండల పరిషత్ బడ్జెట్ ఆమోదం

విశాలాంధ్ర - కే కోటపాడు : స్థానిక మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ రెడ్డి జగన్మోహన్ ఆధ్వర్యంలో జరిగింది. ఎంపీడీవో సాంబశివరావు సమావేశంలో 2025-26 సవరణ బడ్జెట్ 2026-27 అంచనా బడ్జెట్ ప్రవేశపెట్టారు. సవరణ బడ్జెట్ రాబడి రూ. 647429000 , వ్యయం రూ. 625015000 , ముగింపు నిల్వ రూ. 22913500 గా ఉన్నది. అలాగే అంచనా బడ్జెట్ రాబడి రూ. 683174500, వ్యయం రూ. 653386950, ముగింపు నిల్వ రూ. 29787550 చదివి వినిపించగా సభ్యులు ఆమోదించారు. ఇంతకుముందు సమావేశంలో అధికారులు శాఖాపరమైన నివేదికలు సభ్యులకు చదివి వినిపించారు ఈ కార్యక్రమంలో తాసిల్దార్ భుజంగారావు ఎంపీటీసీలు సర్పంచులు వివిధ శాఖ అధికారులు పాల్గొన్నారు.

మొక్కుబడిగా ప్రారంభమైన శవాలయం (మార్చురీ) ... !!

విశాలాంధ్ర - చోడవరం : అనకాపల్లి జిల్లా చోడవరం తామర చెరువు స్మశాన వాటిక వద్ద ప్రభుత్వ, ప్రైవేట్ నిధులుతో, వివిధ హంగులుతో నిర్మించిన శవాలయం (మార్చురీ), ఎట్టికేలకు ప్రారంభానికి నోచుకున్నట్లు అధికారిక బోగట్టా. సిపిఐ, ప్రజా సంఘాలు, పోరుతో అరకొర పోస్టుమార్టంలతో శవాలయాన్ని అప్పుడప్పుడు తెరుస్తున్నారు. అద్భుతంగా నిర్మించిన నిర్మాణాలు, అందుకు సహకరించిన ప్రభుత్వానికి, దాతలు నెలలు తరబడి అన్ని సౌకర్యాలతో నిర్మించిన శవాలయం, విద్యుత్తు...., సాంకేతిక సమస్యలతో ప్రజలకు పూర్తిస్థాయిలో సేవలు అందించే పరిస్థితికి కానరాలేదు. చోడవరం, మాడుగుల తదితర నియోజకవర్గాల్లో సుమారు 11 మండలాలు, సుమారు 50 గ్రామాలకు పైగా ప్రజలు ప్రమాద వశాత్తూ మరణించిన లేదా అనుమానాస్పద మరణాల శవాలు ..పోస్ట్ మార్టం కోసం చోడవరం ప్రభుత్వ ఆసుపత్రి కి పార్థివదేహాలు తీసుకువస్తుంటారు. గడిచిన కొన్నేళ్లుగా నేటికీ ...అనకాపల్లి, విశాఖ తీసుకువెళ్లాల్సిందేనని తెలిపారు. వాచ్ మేన్, ఫ్రీజర్, అంబులెన్స్ సదుపాయాలు వున్నట్టు పెద్ద అక్షరాలతో బోర్డ్ లు, గేట్లు, తాళం అన్నీ వ్యవస్థలు వుండి కూడా ఇంకా ఈ ప్రాంత వాసులకు పోస్టుమార్టం పూర్తిస్థాయిలో అందుబాటులోకి ఎప్పుడు వస్తుందనేది అర్థం కాని సమస్యగా మారింది. సవాలయం మార్చురి పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చేందుకు ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు/అధికారులు..భాధ్యత తీసుకోరా? అని, ప్రమాద సమయాల్లో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నా... పట్టించుకోరా అని, దీని వెనుక అనకాపల్లి కి సంభందించిన ఓ వ్యక్తి స్వార్థ పూరిత వ్యాపార వ్యవహారం వుందని ప్రజలు గుసగుస లాడుతున్నారు. ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు, అధికారులు వెంటనే చర్యలు తీసుకోకపోతే, చట్టపరమైన చర్యలకు .. ప్రజా సంఘాలు తీసుకుంటాయి అని చెబుతున్నారు. మార్చురీ /శవాలయం పూర్తిస్థాయిలో తెరవడం, అందుబాటులోకి తీసుకు రావడం లో కమ్యూనిటీ హెల్త్ సెంటర్ భాధ్యత పూర్తిగా వుందని, తక్షణమే చర్యలు తీసుకోవాలని ప్రజలు, మహిళా సంఘాలవారు కోరుతున్నారు.

మినీ గోకులం నిర్మాణానికి భూమి పూజ

విశాలాంధ్ర - బుచ్చయ్యపేట : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పల్లె పండుగలో మినీ గోకులం షెడ్ల నిర్మాణంలో భాగంగా మండలంలోని చిట్టియ్యపాలెం గ్రామపంచాయతీ పరిధిలో గ్రామానికి చెందిన ఐలా రామస్వామి, పప్పల వెంక నాయుడు, ముచ్చకర్ల చిరంజీవిలకు సంబంధించిన మినీ గోకులం షెడ్‌లో నిర్మాణం కొరకు చోడవరం శాసనసభ్యులు కేఎస్ఎన్ఎస్ రాజు ఆదేశాలతో మంగళవారం భూమి పూజ చేసి శంకుస్థాపన చేసినట్టు గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కొత్తపల్లి జగన్ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు ముచ్చకర్ల మాలినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఎం.కోడూరు హైస్కూల్ విద్యార్థులకు నగదు ప్రోత్సాహక బహుమతులు ప్రదానం

విశాలాంధ్ర - వి.మాడుగుల : మండలంలోని ఎం.కోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2025 మార్చిలో జరిగిన 10వ తరగతి పబ్లిక్ పరీక్షలలో ప్రతిభ కనబరిచిన ముగ్గురు విద్యార్థులకు పాడేరు మోదబాంబ హైస్కూల్ ప్రిన్సిపల్ గొల్లవిల్లి నాగమణి తన భర్త స్వర్గీయ గొల్లవిల్లి వరాహమూర్తి జయంతిని పురస్కరించుకొని మొదటి బహుమతిగా 10 వేల రూపాయల నగదు, జ్ఞాపిక, రెండవ బహుమతిగా 5 వేల రూపాయల నగదు, జ్ఞాపిక మూడవ బహుమతిగా 3 వేల రూపాయల నగదు, జ్ఞాపికలను మంగళవారం అందించారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులకు ముఖ్యంగా ఆడపిల్లలకు చదువు చాలా అవసరమని, 10వ తరగతి వరకే చదువుకున్న తాను పెళ్ళైన తరువాత తన భర్త ఇచ్చిన ప్రోత్సాహంతో ఉన్నత చదువులు చదివి, ఉపాధ్యాయిని కాగలిగానని, తన భర్త ఆశయ సాధన కోసం గత నాలుగేళ్ళ నుండి ఈ నగదు ప్రోత్సాహకాలను అందిస్తున్నానని, తనకు శక్తి ఉన్నంత వరకు ప్రతి ఏడాది నగదు ప్రోత్సాహకాలను విద్యార్థులకు అందిస్తానని తెలిపారు. ప్రతి ఏడాది నగదు బహుమతులతో విద్యార్థులను ప్రోత్సహిస్తున్న ఆమెను పాఠశాల యాజమాన్య కమిటీ ఛైర్మన్ గొల్లవిల్లి అప్పారావు, గ్రామ పెద్దలు అభినందించగా, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ సిబ్బంది ఆమెకు కృతజ్ఞతలు తెలిపారు.

సందడిగా రోలుగుంట పీఎంశ్రీ పాఠశాలలో స్కౌట్స్ అండ్ గైడ్స్ ట్రెక్కింగ్ క్యాంప్

విశాలాంధ్ర - రోలుగుంట : రోలుగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (పీఎంశ్రీ పాఠశాల)లో మంగళవారం స్కౌట్స్ మరియు గైడ్స్ విద్యార్థులకు ప్రత్యేకంగా ట్రెక్కింగ్ క్యాంప్ నిర్వహించారు. ప్రధానో పాధ్యాయులు టివి శేషగిరిరావు, స్కౌట్ మాస్టర్ గోవింద్, గైడ్ కెప్టెన్ పివిఎం నాగజ్యోతి నాయకత్వంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా రాక్ క్లైంబింగ్ నిర్వహించగా ధైర్యం, సమన్వయం, శారీరక దృఢత్వం వంటి నైపుణ్యాలు అభివృద్ధి చెందాయి. అనంతరం ట్రెజర్ హంట్ చేపట్టి టీమ్ స్పిరిట్, సమస్యపరిష్కార నైపుణ్యం, నాయకత్వ లక్షణాలు మరింతగా పెరిగాయి. ట్రెక్కింగ్ మార్గమంతా విద్యార్థులు ప్రకృతి సోయగాలను ఆస్వాదిస్తూ ముందుకు సాగారు. కార్యక్రమం ముగింపులో వనభోజనాలు నిర్వహించగా విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉల్లాసంగా పాల్గొన్నారు. ఈ క్యాంప్ ద్వారా విద్యార్థుల్లో ధైర్యం, క్రమశిక్షణ, సేవాభావం, సహజీవన లక్షణాలు బలపడ్డాయని ఉపాధ్యాయులు అభిప్రాయపడ్డారు.

సిఐటియు మహాసభలను జయప్రదం చేయాలి

విశాలాంధ్ర - అచ్యుతాపురం : సెంటర్ ఆఫ్ ట్రేడ్ యూనియన్ (సిఐటియు) అఖిలభారత 18వ మహాసభలు విశాఖ పట్నంలో డిసెంబర్ 31 నుంచి 2026 జనవరి 4 వరకు జరుగుతున్న సందర్భంగా మంగళవారం అచ్యుతాపురంలో గోడపత్రికను ఆవిష్క రించారు. ఈ మహాసభలో కార్మికులు, ఉద్యోగులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని సిఐటియు కార్యదర్శి ఆర్.రాము, మండల కన్వీనర్ కే సోమునాయుడు పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆలంబిస్తున్న ఉద్యోగ, కార్మిక వ్యతిరేక విధానాలపై ఈ మహాసభల్లో పలు తీర్మానాలు చేయడంతో పాటు భవిష్యత్తు పోరాటాలకు రూప కల్పన జరుగుతుందన్నారు. పారిశ్రామిక కార్మికుల ఉద్యోగ భద్రత, కనీస వేతనాలు, పని గంటల పెంపు వంటి అంశాలపై ఇప్పటికే పలు పోరాటాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వి.చంటి, కె పైడిరాజు, వి.శ్యాము, టి.రాజు, శ్రీను, బాబు, నాయుడు, దొరబాబు, వెంకీలు తదితరులు పాల్గొన్నారు.

మండలం వీఆర్వోలు సంఘం అధ్యక్షుడిగా నూకరాజు

విశాలాంధ్ర - యస్.రాయవరం : మండలంలో గ్రామ రెవిన్యూ అధికారుల సంఘం అధ్యక్షుడిగా ఆర్ నూకరాజు ఏకగ్రీవం ఎన్నికయ్యారు. మంగళవారం జరిగిన ప్రత్యేక సమావేశంలో రాష్ట్ర సంఘం సూచన మేరకు ఎన్నిక నిర్వహించగా అధ్యక్షులుగా నూకరాజు, ఉపాధ్యక్షుడు సిహెచ్ .పెంటయ్య ,కార్యదర్శి గా ఎమ్.జోగారావు ,సహాయ కార్యదర్శి గా మెరుగు శ్రీను ,ట్రెజరర్ గా టి.ఉమ లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక తహసీల్దార్ జె.రమేష్ బాబు ను మర్యాదపూర్వకంగా కలిసి తమ సంఘం ఎన్నిక సంబంధించిన వివరాలు తెలిపారు.

పచ్చదనం పరిశుభ్రత అనే అంశంపై శిక్షణ తరగతులు

విశాలాంధ్ర - వి.మాడుగుల : మాడుగుల ఎంపీడీఓ కొంకి అప్పారావు ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని డ్వాక్రా సంఘాల అధ్యక్షులు, కార్యదర్శులకు పచ్చదనం పరిశుభ్రత అనే అంశంపై ఒక్క రోజు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ మాట్లాడుతూ గ్రామాలలో తడి చెత్త పొడి చెత్త వేరు చేసే విధంగా మహిళలకు అవగాహన కల్పించాలని అన్నారు. మహిళలు ఆర్థికంగా ఎదగడానికి ప్రభుత్వం అన్ని రకాలుగా ఏర్పాటు చేస్తుందని వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ రాజారామ్, వెలుగు ఏపీఎం కుమారి, సీనియర్ అసిస్టెంట్ డీ.సురేష్ కుమార్, పంచాయతీ కార్యదర్శి షేక్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.